ప్రజాశక్తి

బుధవారం 14 డిసెంబర్ 2022

5

విజయనగరం

పేదలకు అండగా ఉంటా : కోలగట్ల

విజయనగరంటౌన్ : నిరాదరణకు గురైన వృద్ధులను ఆదరించి, అక్కున చేర్చుకునేందుకు వైసిపి శ్రేణులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాయని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి వెల్లడించారు. మంగళవారం ద్వారపూడిలో వృద్ధులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలను, వృద్ధులను ఆదుకునేందుకు వైసిపి శ్రేణులు ముందుంటాయని అన్నారు. సేవ చేయాలన్న ఆలోచన ఎంతో గొప్పదన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహించే పరిస్థితుల్లో తమ వంతు సహకారాన్ని అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు డోలా మన్మధ కుమార్, ఎంపిపి మామిడి అప్పలనాయుడు, ఎఎంసి చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, గాజులరేగ పిఎసిఎస్ అధ్యక్షులు జమ్ము మధు, ద్వారపూడి వైసిపి నాయకులు బూడి ప్రవీణ్ కుమార్, వెంపటాపు ఈశ్వరరావు, జామి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలో ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆశావర్కర్స్ యూనియర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి

ఆశాల సమస్యలపై సమరశీల పోరాటాలు

- ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి
- రాష్ట్ర మహాసభలో పలు తీర్మానాలు
- ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి : సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి భవిష్యత్తులో మిలిటెంట్ పోరాటాలు నిర్వహిస్తామని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆశా కార్యకర్తలను కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం 26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నగరంలోని నిరంజనా నిరూలా నగర్ మల్లు స్వరాజ్యం ప్రాంగణంలో (ఎస్.కన్వెన్షన్) జరిగిన ఆ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఆమె ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడారు. మహాసభలో చేసిన తీర్మానాలను అనంతరం విలేకర్ల సమావేశంలో వివరించారు. రెండు రోజులు పాటు జరిగిన మహాసభల్లో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విధానాలు, వైద్య రంగంలో వస్తున్న మార్పులు, ఆశా లు ఎదుర్కుంటున్న సమస్యలు వాటి సాధన కోసం భవిష్యత్ కార్యాచరణను చర్చించినట్లు తెలిపారు. ప్రధానంగా మహాసభల్లో రానున్న మూడేళ్ల కాలంలో చేయాల్సిన కార్యాచరణపై చర్చించి పలు సమస్యలపై తీర్మానాలు చేశామన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి రానున్న మూడేళ్లలో సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి

దేశంలో ప్రభుత్వ రంగాన్ని కాపాడుకునేందుకు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని, అందులో ఆశా వర్కర్ల భాగస్వామ్యం కావాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. వైద్య రంగాన్ని బలోపేతం చేసి ఆశావర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల రాష్ట్ర మహాసభలో ప్రతినిధులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 5వేల ఆశా వర్కర్ల పోస్టులను భర్తీ చేసి ప్రజల ప్రాణాలకు భరోసా కల్పించాలని అన్నారు.

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పన్నులు ధనవంతులపై వేయకుండా ఆహార ధాన్యాలపై వేయడం వల్ల నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరుగుతున్నా యన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తుందన్నారు. కార్మిక చట్టాలను ధనవంతులకు చుట్టాలుగా మార్చి కార్మిక కోడ్‌లను తీసుకొచ్చిందని అన్నారు. కార్మిక చట్టాల ప్రకారం వేతనాలు ఇవ్వకపోతే యజమానిని అరెస్ట్ చేయాలని, కానీ దోపిడీ దారులకు అనుకూలంగా ప్రభుత్వం ఉందన్నారు. సమ్మె చేసే హక్కును కాలరాస్తున్నా రన్నారు. పోరాడి తెచ్చుకున్న కార్మిక చట్టాలను కాపాడుకుంటూ, కొత్తవి సాధించుకునే విధంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రానున్న కాలంలో ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా, ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. పేదలకు ప్రభుత్వ రంగాల ద్వారానే సేవలు అందుతాయని, వాటిని కాపాడుకోవాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగావున్న ఏడు వేల పోస్టులను భర్తీ చేయకపోవడం వల్ల ఆశా కార్యక్తలపై పనిభారం పెరుగుతోందని అన్నారు. కోవిడ్‌లో మరణించినవారికి రూ.50లక్షలు చొప్పున పరిహారం చెల్లించకపోతే జగన్ ప్రభుత్వానికి కోర్టులకెక్కిస్తామని హెచ్చరించారు. ఆశా వర్కర్ల న్యాయమైన పోరాటానికి సిఐటియు అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

మహాసభల్లో భాగంగా నిర్వహించిన 'ఆటపాట' కార్యక్రమంలోని విజేతలకు ముగింపు సభకు ముఖ్య అతిధిగా హాజరైన సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. మహాసభ అధ్యక్షవర్గంగా రాష్ట్ర అధ్యక్షులు కె.పోశమ్మ, బి.సుధారాణి, వై.మంగమ్మ, డి.అన్నపూర్ణమ్మ, సిహెచ్ పద్మలు వ్యవహరించారు. సమావేశంలో కోశాధికారి కె.కమల, తీర్మానాల కమిటీ కన్వీనర్ ఎం.వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికైన ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు

ఆట-పాటలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు

పోరాటాలకు అండగా ఉంటాం

ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం చేసే పోరాటాలకు అండగా ఉంటామని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు అన్నారు. మహాసభలో ఆయన మాట్లాడుతూ విద్యా వైద్య రంగాలు బలోపేతం కావడం ద్వారానే పేదలకు మేలు జరుగుతుందని అన్నారు. మహాసభకు హాజరైన క్వీన్స్ ఎన్ఆర్ఐ జనరల్ మేనేజర్ సతీష్‌బాబు మాట్లాడుతూ ఆశావర్కర్లకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని అన్నారు. వీరు చేస్తున్న పోరాటాలు స్ఫూర్తి దాయకమన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యరంగాన్ని ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేదని అన్నారు. నేడు ఉద్యోగులు, స్కీమ్ వర్కర్ల సమస్యలు పట్టించుకునే స్థితిలో ప్రభుత్వం లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో హక్కులు సాధించాలంటే చట్టసభల్లో ప్రశ్నించే గొంతుకలు అవసరమన్నారు. పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించు కోవడం ద్వారా మన సమస్యలు పరిష్కరించుకోవాలని అన్నారు.

ఇవీ తీర్మానాలు

- ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించి, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలి.
- ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవులు, మెటర్నిటీ సెలవులు అమలు చేయాలి. చనిపోయిన వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలి.
- రిటైరైన వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలి. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి.
- జనాభా ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో అదనపు ఆశా వర్కర్లను నియమించాలి. ఆశా వర్కర్లకు పని భారం తగ్గించాలి.
- ఎఎన్ఎం శిక్షణ పొందిన ఆశా వర్కర్లకు పోస్టుల భర్తీలో వేయిటేజి ఇవ్వాలి. ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి
- గిరిజన ప్రాంతాల్లో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్‌లను ఆశా కార్యకర్తగా మార్చాలి.
- విద్యా,వైద్య రంగాలను ప్రభుత్వ రంగంలో ఉంచాలి. జిడిపిలో ఈ రెండు రంగాలకు 6శాతం బడ్జెట్ కేటాయించాలి.
- పెరిగిన ధరలు కు అనుగుణంగా వేతనాలు పెంచాలి. ఫేస్ రీడింగ్ విధానాన్ని విరమించుకోవాలి. కార్మిక చట్టాలలో మార్పులు వెనక్కి తీసుకోవాలి.

నేత్రదాన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

ఒకరి నేత్రదానం...ఇద్దరి జీవితాలకు వెలుగు

- యువత ముందుకు రావాలని కలెక్టర్ పిలుపు
- రెడ్‌క్రాస్‌లో నేత్రదాన కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం

ఒకరి నేత్రదానంతో ఇద్దరికి చూపునివ్వడం ద్వారా వారి జీవితాల్లో వెలుగును నింపవచ్చని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి అన్నారు. నేత్రదానం పట్ల ఉన్న అపోహలను విడనాడి, అన్ని వర్గాల ప్రజలు, ముఖ్యంగా యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కంటోన్మెంటులోని ఇండియన్ రెడ్‌క్రాస్ కొత్త భవనంలో, నేత్రదాన కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళ్లు లేనివారికి మాత్రమే చూపువిలువ తెలుస్తుందని అన్నారు. ఇలాంటి వారికి చూపునిచ్చేందుకు రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నేత్రదాన కేంద్రాన్ని ప్రారంభించారని తెలిపారు. నేత్రదానం చేసిన వారినుంచి కార్నియాను సేకరించడానికి ఈ ఐ బ్యాంకు కార్నియా కలక్షన్ సెంటర్ ఉపయోడపడుతుందని చెప్పారు. ప్రస్తుతానికి ఎల్‌వి ప్రసాద్ లేబరేటరీలో కార్నియాలను భద్రపరుస్తున్నారని చెప్పారు. భవిష్యత్తులో ఇక్కడే భద్రపరిచి, కంటి శస్త్రచికిత్సలను కూడా చేసే స్థాయికి రెడ్‌క్రాస్ ఎదగాలని ఆకాంక్షించారు. నేత్రదానం పట్ల భయాన్ని, అపోహలను విడనాడి పెద్ద సంఖ్యలో ప్రజలు ముందుకు రావాలని కోరారు. జిల్లాలో కేన్సర్ నిర్ధారణా శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంత త్వరగా కేన్సర్‌ను గుర్తించగలిగితే, నయం చేసుకొనే అవకాశాలు అంత ఎక్కువగా ఉంటాయని అన్నారు. దీనికోసం కేన్సర్ స్కీనింగ్ పరీక్షలు దోహదపడతాయని చెప్పారు. దీనికి సంబంధించిన కరపత్రాలను, బోర్డులను కలెక్టర్ ఆవిష్కరించారు. నేత్రదాన కేంద్రానికి దాతల నుంచి విరాళాలను స్వీకరించారు. ఎల్‌బిఆర్ ఫౌండేషన్ ట్రస్టీలు ఎల్.రవీంద్రబాబు, ఎల్. శరత్‌బాబు, ఐ బ్యాంకు ఏర్పాటు కోసం రూ.లక్ష నగదు, అవసరమైన పరికరాలను అందజేశారు. రెడ్‌క్రాస్ ను అభినందిస్తూ పట్టణ ప్రముఖులు పిళ్లా విజయకుమార్ రూ.లక్ష చెక్కును విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ కెఆర్‌డి ప్రసాదరావు, కార్యదర్శి కె.సత్యం, జిల్లా సైనిక సంక్షేమాధికారి మజ్జి కృష్ణారావు, రెడ్‌క్రాస్ సభ్యులు డాక్టర్ ఎన్‌వి సూర్యనారాయణ, ఎస్ఎస్-ఎస్ఎస్ విఆర్ఎం రాజు, డాక్టర్ ఎం.వెంకటేశ్వర్రావు, చదలవాడ ప్రసాద్, ఆర్.కె. జైన్, కమిటీ సభ్యులు వై.సత్తిరాజుల నాయుడు, టి.రామారావు, బి.రామకృష్ణారావు, టి.రామకృష్ణ, ఎల్‌వి ప్రసాద్ ఆసుపత్రి ప్రతినిధులు డాక్టర్ అజిత్, రెడ్‌క్రాస్ వలంటీర్లు పాల్గొన్నారు.

బాలికలంతా చదువుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

బేసిక్ ఎడ్యుకేషన్ అండ్ లిటరసీ కార్యక్రమం కింద రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం 88 మంది నిరుపేద బాలికలకు సైకిళ్లను కలెక్టర్ సూర్య కుమారి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమం కింద 34మంది మహిళలకు కుట్టు మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సైకిళ్లను పంపిణీ చేసిన రోటరీ క్లబ్ ప్రతినిధులను అభినందించారు. సైకిళ్ల పంపిణీ, రక్త దానం ద్వారా మంచి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు జైన్, ఉమ, డాక్టర్ వెంకటేశ్వర రావు, డాక్టర్ పద్మావతి, కాశీ విశ్వనాధం, రాధికా రాణి పాల్గొన్నారు.

ఆపద మిత్రల శిక్షణలో మనమే ఫస్ట్

ప్రజాశక్తి-విజయనగరం

ప్రకృతి వైపరీత్యాలు, అగ్ని ప్రమాదాలు, వరదలు, ఇతర విపత్తులను ధైర్యంగా ఎదుర్కొనేందుకు, ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ఆసక్తి కలిగిన, అర్హత కలిగిన ఆపద మిత్రలకు అందిస్తున్న శిక్షణలో మన రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచామని ఎస్ఐఆర్‌డి డైరక్టర్ జె. మురళి పేర్కొన్నారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకొని ఆపద మిత్రలందరూ ప్రశంసనీయమైన సేవలందించాలని పిలుపునిచ్చారు. ఇతరులు ప్రాణాలను కాపాడాలంటే ముందుగా ఆపద మిత్రలు మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. విజయనగరం యూత్ హాస్టల్, మహిళా ప్రాంగణం వేదికగా జరుగుతున్న ఆపద మిత్రల శిక్షణ శిబిరాలను మంగళవారం ఆయన సందర్శించారు ఈ సందర్భంగా ముందుగా ఆయన ఆపద మిత్రలతో ముఖాముఖి నిర్వహించారు. సమాజంలో భాగస్వామ్యమైన మనమందరం ప్రాథమిక బాధ్యతలను నిర్వర్తిస్తూ ఇతరులకు సేవ చేయాలని హితవు పలికారు. రక్త దానం చేయాలని, ఇతరుల ప్రాణాలను కాపాడాలని ఆపద మిత్రలకు చెప్పారు. ఆపద మిత్రలకు రూ.5 లక్షల ప్రమాద భీమా వర్తిస్తుందని తెలిపారు. పంచాయతీ రాజ్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ మోహన్, జెడ్‌పి సిఇఒ అశోక్ కుమార్, డిప్యూటీ సిఇఒ రాజ్ కుమార్, డిపిఒలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్షయ రోగులకు అరబిందో ఫార్మా ఫౌండేషన్ సాయం

పోషకాహారం సరఫరా నిమిత్తం రూ.12.60లక్షల విరాళం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో క్షయ నిర్మూలనలో పెద్ద ఎత్తున సహాయం అందించేందుకు ప్రముఖ ఔషధ ఉత్పత్తుల సంస్థ అరబిందో ఫార్మా ఫౌండేషన్ ముందుకొచ్చింది. దేశంలో క్షయవ్యాధి నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి టి.బి.ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 300 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు ఆరు నెలలపాటు పౌష్టికాహారం అందించేందుకు కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల నుంచి రూ.12.60 లక్షలను విరాళంగా అందజేసింది. ఈ మేరకు ఆరు నెలలపాటు 300 మంది రోగులకు ఫుడ్ బాస్కెట్‌లు అందజేసేందుకు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ విభాగానికి రూ.12.60 లక్షలు చెక్కు రూపంలో అందజేసింది. ఈ మేరకు సంస్థ ఎమ్‌డి. కె.నిత్యానందరెడ్డి తరపున చెక్కును అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు మంగళవారం కలెక్టర్ ఎ.సూర్యకుమారికి అందజేశారు. ఆరు నెలలపాటు ఒక్కో రోగికి పౌష్టికాహారం సరఫరాకోసం రూ.4200 ఖర్చు చేసేందుకు వీలుగా ఈ సహాయం అందిస్తున్నామని సంస్థ ప్రతినిధులు వివరించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కోరిన మీదట ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాల్లో 1,000 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు తమ ఫౌండేషన్ ద్వారా రూ.42 లక్షల సహాయం అందిస్తున్నట్టు సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు.

కలెక్టర్‌కు విరాళ పత్రాలు అందజేస్తున్న ప్రతినిధులు

నెల్లిమర్ల ఎమ్మెల్యే కుమారుడి వివాహానికి

నేడు ముఖ్యమంత్రి రాక

ప్రజాశక్తి-విజయనగరం

నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కుమారుడి వివాహ రిసెప్షన్‌కు హాజరయ్యేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బుధవారం జిల్లాకు విచ్చేస్తున్నారు. దాకమర్రిలోని రఘు ఇంజినీరింగ్ కళాశాలలో వివాహ వేదిక, కళాశాల ప్రాంగణానికి ఎదురుగా ఉన్న ఎన్‌సిసి మైదానంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యమంత్రి బుధవారం మధ్యాహ్నం గన్నవరం ఎయిర్ పోర్టు నుంచి విశాఖపట్నం, అక్కడ నుంచి హెలీక్యాప్టర్ ద్వారా నుంచి రఘు ఇంజినీరింగ్ కళాశాల ఎదురుగా ఎన్‌సిసి మైదానంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ నుంచి కాన్వాయ్ ద్వారా కళాశాల లోపల ఏర్పాటు చేస్తున్న రిసెప్షన్ వేదిక వద్దకు చేరుకుంటారు. ఈ మేరకు పోలీసు, రెవెన్యూ అధికారులు సంబంధిత ఏర్పాట్లు చేస్తున్నారు.విఐపిలు వేదిక వద్దకు చేరుకొనేందుకు రఘు ఇంజనీరింగ్ కళాశాల మెయిన్ గేటు నుంచి ప్రవేశం కల్పించగా, ఇతరులకు మోపాడ రోడ్డు నుంచి ప్రవేశం కల్పించారు. ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో కళాశాల సమీపంలో బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నారు.

కళాశాల ప్రాంగణంలో, హెలీప్యాడ్ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను మంగళవారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, విశాఖపట్టణం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లిఖార్జున, సిపి సిహెచ్ శ్రీకాంత్ పర్యవేక్షించారు. అధికారులకు, సిబ్బందికి ఏర్పాట్లకు సంబంధించిన సూచనలు చేశారు.

నేటి నుంచి విద్యుత్ పొదుపు వారోత్సవాలు

నేడు నగరంలో అవగాహన ర్యాలీ : ఇపిడిసిఎల్ ఎస్ఇ నాగేశ్వరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు విద్యుత్ పొదుపు వారోత్సవాలు నిర్వమిస్తామని ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ పి.నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం విద్యుత్ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొదుపు వారోత్సవాలు బాగంగా బుధవారం ఉదయం కలెక్టరేట్ నుంచి బాలాజీ జంక్షన్ వరకు 400మందితో అవగాహన ర్యాలీ ఉంటుందని, ర్యాలీని కలెక్టర్ ప్రారంభిస్తారని తెలిపారు. 15న హైస్కూల్ విద్యార్థులకు 12, 15ఏళ్ల లోపు విద్యార్థులతో పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. 16న జెఎన్‌టియు ఎన్ టి యు కాలేజీలో అవగాహన సదస్సు, 17న హైస్కూల్ విద్యార్థులకు రెండు కేటగిరిల్లో వ్యాసరచన పోటీలు, వకృత్వ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 18న కరపత్రాలు విస్తతంగా పంపిణీ, 19న అన్ని సబ్ డివిజన్లలో అవగాహన సదస్సులు, 20న విద్యుత్ భవనంలో వారోత్సవాలు ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు జిల్లా కలెక్టర్ చేతులు మీదుగా అందజేస్తామని తెలిపారు. విద్యుత్ పొదుపు చేయడం అంటే పర్యావరణాన్ని పరిరక్షించేందుకు అనే విషయం ప్రజలు గ్రహించాలని కోరారు. హైగ్రేడ్ స్టార్ వస్తువులు ఉపయోగించడం ద్వారా విద్యుత్ పొదుపు అవుతుందన్నారు.

అనంతరం వారోత్సవాల గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇఇ నాగిరెడ్డి కృష్ణమూర్తి, డిఇలు ఎల్.సత్యన్నారాయణ, బివిరమణ, ఆర్.ఈశ్వరరావు, జెఇ హెచ్.భాస్కరరావు, ఇఇ టెక్నికల్ ఎం.ధర్మరాజు, ఇఇ ట్రాన్స్‌ఫార్మర్ డి.ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అశోక్ స్ఫూర్తితో అభివృద్ధి పనులు చేయండి : టిడిపి

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపి నాయకులు పి.అశోక్‌గజపతిరాజును స్ఫూర్తిగా తీసుకొని వైసిపి నాయకులు అభివృద్ధి పనులు చేపట్టాలని, కొబ్బరి కాయలు కొట్టడానికే పరిమితం కారాదాని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, మండల అధ్యక్షులు బొద్దుల నర్సింగరావు, నగర పార్టీ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్ అన్నారు. మంగళవారం గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన సంతకాల బ్రిడ్జిని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అశోక్‌గజపతిరాజు కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో చెల్లూరు నుంచి గొట్లాం వరకు ఈ బైపాస్ రోడ్డు ను సుమారు రూ.450 కోట్లతో తలపెట్టారని అన్నారు. రూ.250 కోట్లతో రోడ్ల విస్తీర్ణం అభివృద్ధి పనులు చేశారని తెలిపారు. చెల్లూరు నుంచి రాజాపు లోవ వరకు జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టారన్నారు. వైసిపి ప్రభుత్వం ఏదో గంట స్తంభానికి రంగులేసాం, మెరిసే లైటింగ్‌లు వేయడం తప్ప ఏమీ లేదన్నారు.

సంతకాల వంతెనను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

ఎపి ఎన్‌జిఒ సంఘం పట్టణ నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్ష, కార్యదర్శులుగా రామరాజు, పైడిరాజు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎపి ఎన్‌జిఒ సంఘం విజయనగరం అధ్యక్ష, కార్యదర్శులుగా కె.రామరాజు, జి.పైడిరాజు ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో టౌన్ కమిటీ ఎన్నిక జిల్లా అధ్యక్షులు జె.మురళి పర్యవేక్షణలో జరిగింది. అసోసియేట్ అధ్యక్షులుగా వివిఆర్ఎం రాజు, ఉపాధ్యక్షులుగా ఎ.కనకరాజు, ఎ.అచ్యుతరావు, కె.ధనంజయ రావు, ఎన్.రాంబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎన్.శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులుగా పి.రామకృష్ణ, పివిఎస్ఎస్ఎన్ మూర్తి, కె.సదాశివ, కె.చంద్ర కిరణ్, అర్.శ్రీస్వప్న, సిహెచ్ అప్పలనాయుడు ఎన్నికయ్యారు. నూతన కమిటీకి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.మురళి, సురేష్ అభినందనలు తెలిపారు.

ఎన్నికైన నూతన కార్యవర్గం

నూతనంగా ఎన్నికైన సొసైటీ సభ్యులు

కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నిక

అధ్యక్ష కార్యదర్శులుగా రామునాయుడు, కూర్మారావు

విజయనగరం టౌన్ : శ్రీ వెంకటేశ్వర ఎపి ఇపిడిసిఎల్ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులుగా వి.రామునాయుడు, బి.కూర్మారావు ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యక్షులుగా జి.అప్పలనాయుడు, కార్యదర్శిగా బి.కూర్మారావు, సంయుక్త కార్యదర్శిగా ఎ.రవి, ఎస్.మురళీ, ఎస్.రమణ, ఎన్. పైడిరాజు, కె.రాజశేఖర్, జి.అప్పలసూరినాయుడు బోర్డు ఆఫ్ డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. సొసైటీ కొత్త పాలకవర్గం ఎన్నుకోవడంలో పూర్వ అధ్యక్షులు శ్రీదేవి, డిఆర్ఎస్ వరప్రసాద్ ప్రధాన బాధ్యత వహించారు. సొసైటీకి ఏకగ్రీవంగా పాలకవర్గాన్ని ఎన్నుకోవడానికి సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞత అభినందనలు తెలిపారు. సొసైటీ అభివృద్ధికి, సభ్యులకు మెరుగైన సేవలు అందించడానికి కొత్త పాలకవర్గం తమ వంతు కృషిచేస్తుందని తెలిపారు. దీర్ఘకాలం అధ్యక్షులుగా బాధ్యత వహించిన డిఆర్ఎస్ ప్రసాద్, పాత పాలకవర్గంలో డైరెక్టర్లుగా వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

జిపిడిపిపై శిక్షణా కార్యక్రమం

వేపాడ : స్థానిక వైయస్సార్ క్రాంతి పథకం సమావేశ మందిరంలో మంగళవారం జిపిడిపిపై సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి డి. సత్యవంతుడు మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని, గ్రామ సచివాలయాలు పంచాయతీలు అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సేనాపతి అప్పలనాయుడు, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, మండల వైసిపి అధ్యక్షుడు ఎం. జగన్నాథం, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు నిడిగోటి వెంకటరావు, ఎంపిడిఒ బిహెచ్ఎస్ పట్నాయక్ పంచాయతీ విస్తరణ అధికారి సిహెచ్ సూర్యనారాయణ, మండల వ్యవసాయ శాఖ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఈర్లే సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో గ్రామాభివృద్ధి ప్రణాళికపై మూడు రోజుల పాటు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎ. గిరిబాల పాల్గొని మాట్లాడారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని ముందుకెళ్లాలన్నారు.

డాక్టర్ కుమార స్వామి సేవలు అభినందనీయం

విజయనగరంటౌన్ : సమాజ శ్రేయస్సు కోసం తమ వంతు కృషి చేస్తున్న డాక్టర్ మంచు కుమారస్వామి సేవలు ఎంతయినా అభినందనీయమని వైశ్యసేవా సంఘం నగరపాలక అధ్యక్షులు ఆశపు వేణు, ప్రముఖ వ్యాపారి ఉప్పు ప్రకాశరావు, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ యూ అప్పలరాజు,17వ డివిజన్ కార్పొరేటర్ ఆశపు సుజాత అన్నారు. మంగళవారం పుచ్చలపల్లిలో ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ మంచు కుమార స్వామి పర్యవేక్షణలో ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వీరు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కుమార స్వామి మాట్లాడుతూ సామాన్య ప్రజలకు ఉచిత వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ కూడా తప్పనిసరిగా కళ్ళ పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. ప్రధానంగా డయాబెటిస్ రోగులు కంటి వైద్య పరీక్షలు చేయించుకోవడం ముఖ్యమని అన్నారు. ఆశపు వేణు మాట్లాడుతూ కుమారస్వామి ప్రజల మన్ననలు పొందిన డాక్టర్‌గా పేరుగాంచారని అన్నారు. ఈ వైద్య శిబిరంలో 200 మంది రోగులు కు కంటి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన

వేపాడ : మండలంలోని వీలుపర్తి క్లస్టర్ చిన్న గుడిపాల గ్రామంలో అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం కాశీపట్నం హోలీ స్పిరిట్ సంస్థకు చెందిన విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. గ్రామానికి చెందిన బి. శ్రీనివాసరావు పొలంలో మంగళవారం సందర్శించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులైన ద్రవ జీవామృతం తయారీ, ఘనజీవామృతం, వివిధ కషాయాలు, పుల్లటి, మజ్జిగ, దశపరిని, అగ్ని అస్త్రం తయారు చేసి వివరించారు. చెరకు, మామిడి, కూరగాయలు దేశీయ వరి రకాలు పంటలు, చేపల పెంపకం పశువులు మూత్రం సేకరణలో ప్రకృతి వ్యవసాయం పద్ధతుల అవలంబించిన పద్ధతులను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సన్యాసమ్మ, రాము, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు

నెల్లిమర్ల : రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తోందని ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మంగళ వారం గుషిని, మొయిద గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యం అమ్మడానికి దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ధాన్యం విక్రయించిన మూడు వారాల్లోగా రైతుల ఖాతాల్లోకే నేరుగా డబ్బులు జమ అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ళ సుధారాణి, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ళ శ్రీరాములు నాయుడు, డిసిసిబి వైస్ చైర్మన్ చనమల్ల వెంకట రమణ, జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, తుమ్మలపేట పిఎసిఎస్ అధ్యక్షులు కోట్ల పైడినాయుడు, ఎంపిటిసి సంగం రెడ్డి జగన్నాధం, తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం: కాలం రాజుపేట గ్రామంలో రైతు కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం తహశీల్దార్ ఎం.అరుణ కుమారి తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే ధాన్యం కొనుగోలు జరుగుతున్నదా లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. గోనె సంచులు, కూలీ ఖర్చులను ప్రభుత్వం రైతుల ఖాతాలో వేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌డిటి రవిశంకర్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ షేక్ మస్తాన్, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు తగవు

గజపతినగరం : ప్రతిపక్ష నాయకులకు అనవసరమైన ఆరోపణలు చేయడం తగదని జెడ్‌పిటిసి గార తవుడు, కరణం ఆదినారాయణ, బెల్లాన త్రినాధరావు అన్నారు. స్థానిక పిఎసిఎస్ వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎంతో పారదర్శకంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కార్యక్రమాన్ని చేస్తుంటే చూసి ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు చౌకబారు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసమే ఆరోపణలను అలవాటుగా మార్చుకున్నారని అన్నారు.

15న సీజ్ చేసిన బైకులు వేలం

జామి : స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేయబడిన మోటారు సైకిళ్లను ఈనెల 15వ తేదీ ఉదయం 10గంటలకు వేలం వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్.ఐ వీరబాబు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వేలం పాటలో పాల్గొనేందుకు ఆశక్తి ఉన్నవారు పోలీసులను సంప్రదించాలని కోరారు.

వికలాంగుల వైద్య శిబిరం విజయవంతం

రామభద్రపురం: స్థానిక భవిత కేంద్రంలో రామభద్రపురం, బాడంగి, తెర్లాం, బొబ్బిలి మండలాల పరిధిలోగల ఒకటి నుండి 18 సంవత్సరాలలోపు ప్రత్యేక అవసరాలగల పిల్లలకు ఉపకరణాలు అందించేందుకు ఏర్పాటు చేసిన వైద్య నిర్ధారణ శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా జిల్లా సహిత విద్యా సమన్వయకర్త ఎస్ సూర్యారావు మాట్లాడుతూ ప్రభుత్వం వికలాంగ విద్యార్థులకు ఉచిత ఉపకారణాలతో పాటు రవాణా, ఎస్కార్ట్, స్టైఫండ్ వంటి సౌకర్యాలు సమగ్ర శిక్ష ద్వారా అందిస్తుందన్నారు. మండల విద్యాశాఖ అధికారి తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో డాక్టర్ ఆశ కృష్ణన్, డాక్టర్ నేతాజీ, యామిని వైద్య పరీక్షలు చేశారన్నారు. వైద్యపరీక్షలలో 40 ట్రైసైకిల్స్, 35 వీల్ చైర్స్ 50 మందికి వినికిడి యంత్రాలు, 120 మందికి బస్ పాస్‌లకు ఎంపిక చేశారు. ఈ శిభిరానికి జిల్లా సహిత విద్యా సహాయ సమన్వయకర్త భారతి, ప్రత్యేక ఉపాద్యాయుడు కొల్లి ఈశ్వరరావు, సునీల్, బొబ్బిలి, తెర్లాం, బాడంగి, రామభద్రపురం ఐఇఆర్‌పిలు, 250 మంది వికలాంగుల వారి తల్లిదండ్రులు హాజరయ్యారు.

మైనర్లకు వాహనాలిస్తే కఠిన చర్యలు

రామభద్రపురం: మైనర్‌లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సురేంద్ర నాయడు హెచ్చరించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వాహనాలు డ్రైవ్ చేస్తూ పట్టుబడ్డ మైనర్ల తల్లి దండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్ వ్యక్తులు వాహనాలు నడిపిన, వాహనం ఇచ్చిన వారికి కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. వాహన దారులు అందరికీ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్‌లు

ప్రజాశక్తి- రేగిడి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఈ ఎగ్జిబిషన్‌లో 12 జిల్లా పరిషత్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 100 రకాల ప్రాజెక్టులతో హాజరయ్యారు. ఈ ప్రదర్శనను మండల విద్యాశాఖాధికారి ఎంవి వర ప్రసాద రావు పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు ఎమ్.రామినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎగ్జిబిషన్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రేగిడి, కందిస, సంకిలి, కోడిస, లక్ష్మి పురం పాఠశాలలు జనవరి 27, 28 తేదీలలో నిర్వహించబడే జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపికయ్యాయి. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డెంకాడ : మండలంలోని పినతాడివాడ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి సైన్స్ ప్రదర్శన చేపట్టారు. ఈ సైన్స్ ప్రదర్శనను స్థానిక సర్పంచ్ లెంక లక్ష్మణరావు ప్రారంభించారు. మండల స్థాయిలో జరిగిన ఈ ప్రదర్శనకు 9 పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొని 42 ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఇందులో గెలుపొందిన వారికి స్థానిక పిహెచ్ డాక్టర్ పావని బహుమతులను అందజేశారు. మండల విద్యాశాఖ అధికారి ఏ కృష్ణారావు, పెదతాడివాడ జిల్లా పరిషత్తు పాఠశాల ఉపాధ్యాయుడు శాంతి స్వరూప్, ఏఎస్ఐ మురళి, అక్కివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు బలరాము, ప్రధానోపాధ్యాయుడు రామారావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు, ఎంపిపి సుధారాణి

నెల్లిమర్ల: నగర పంచాయతీ ప్రభుత్వ పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ మండల విద్యాశాఖ అధికారి ఏ. కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని 19 పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొని ఆకట్టుకునే ప్రాజెక్టులను తయారు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ సురేష్‌బాబు విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ల సుధారాణి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డ్ సలహా సభ్యులు అంబళ్ల శ్రీరాములునాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. విజయ కుమారి, వార్డు కౌన్సిలర్లు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: మండలంలో పూసపటిరేగ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు ఘనంగా నిర్వహించారు. ఈ ప్రదర్శనలను ఎంపిపి మహంతి కళ్యాణి ప్రారంభించారు. ఇక్కడ ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన ఐదు పాఠశాలలను జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపికచేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ లలిత కుమారి, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ కృష్ణారావు, జిల్లా అకడమిక్ కోఆర్డినేటర్ రాజేష్, ఉపాధ్యాఉలు విద్యార్థులు పాల్గొన్నారు.

మెరక ముడిదాం: విద్యార్థులలో అంతర్లీంగా వున్న సృజనాత్మక శక్తిని వెలికి తీయటానికి వైజ్ఞానిక ప్రదర్శనలు ఉపయోగ పడతాయని మండల నాయకులు తెలిపారు. మంగళవారం మెరక ముడిదాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను వారు తిలకించారు. మండలంలోని 11 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని ప్రదర్శనలు ఇచ్చారు. వీటిలో ఐదు పాఠశాలలు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తాడ్డి వేణుగోపాల రావు, ఎస్‌వి రమణరాజు, కోట్ల మోతిలాల్ నాయుడు, కోట్ల వెంకటరావు, కుచ్చర్లపాటి శివరామకృష్ణ ప్రసాద్, వైస్ ఎంపిపి తల చుట్ల హరిబాబు ,ఎంఇఒ పి. రామారావు, జెడ్‌పిహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు పాదం గణపతి లక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పూసపాటిరేగ : ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఎంపిపి కళ్యాణి

డెంకాడ : ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ లెంక లక్ష్మణరావు

టిడిపితోనే భవిష్యత్తుకు భరోసా : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి- గజపతినగరం : భవిష్యత్తుకు భరోసా ఇచ్చేది టిడిపి మాత్రమేనని మాజీ ఎమ్మెల్యే కె.ఎ నాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని మరుపల్లి గ్రామంలో 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' అనే కార్యక్రమాన్ని పార్టీ నాయకులతో కలిసి చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా పలు సమస్యలు తెలుసుకున్నామన్నారు. మద్యం బెల్ట్ షాపులు విపరీతంగా పెరిగిపోవడంతో నిరాశలో ఉన్న మహిళలకు ఓదార్పునిచ్చామన్నారు. టిడిపి హయాంలో గ్రామానికి కమ్యూనిటీ హాల్ ఇవ్వగా ప్రస్తుత ప్రభుత్వం దాని నిర్వహణను నిలుపుదల చేసిందని మరల తాము అధికారంలోకి రాగానే దాని నిర్వహణ పూర్తి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి గంట్యాడ శ్రీదేవి, మండల పార్టీ అధ్యక్షులు అట్టాడ లక్ష్మ నాయుడు, పార్టీ నాయకులు పివివి గోపాల రాజు, బండారు బాలాజీ, డాకి నారాయణప్పడు, రుంకాన అరుణ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : నగరపంచాయతి పరిధిలోని 5,7,8 వార్డుల్లో మంగళవారం టిడిపి ఆధ్వర్యంలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామినాయుడు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం పేదలకు తీరని అన్యాయం చేస్తుందని విపరీతంగా నిత్యావసరలు పెంచి వారిని మరిన్ని ఇబ్బందులకు గురిచేస్తుందని అన్నారు. వెంటనే ఈ ప్రభుత్వాన్ని గద్దె దించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగరం పంచాయతీ టిడిపి అధ్యక్షులు బైరెడ్డి లీలావతి, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి గేదెల రాజారావు నాయకులు పతివాడ తమ్ము నాయుడు, లెంక అప్పలనాయుడు, బైరెడ్డి నాగేశ్వరరావు, గురాన అసిరి నాయుడు, పోతల రాజాప్పన, రెడ్డి వేణు, కలిశెట్టి కన్నంనాయుడు, గురాన చక్రధర్, ముడుమంచి లక్ష్మణరావు, చందక శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

మెరక ముడిదాం: మండలంలోని గర్భాం మేజర్ పంచాయతీలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు తాడ్డి సన్యాసినాయుడు, తాడ్డి శ్రీధర్ ఆధ్వర్యంలో 'ఇదేం కర్మ రాష్ట్రానికి ' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంఆ ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడారు. ఈ ప్రభుత్వం ఒక్కరికి కూడా బిసి లోన్ ఇప్పించలేని పరిస్థితిలో ఉందన్నారు. కార్పొరేషన్‌లు ఫుల్ -నిధులు నిల్ ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

భోగాపురం: రాష్ట్రంలో అరాచక వైసిపి పాలన మారాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్రోతు బంగారు రాజు అన్నారు. ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని మండలంలోని చేపల కంచేరు పంచాయతీలో మంగళవారం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇంటికి తిరిగి వైసిపి ప్రభుత్వం చేస్తున్న అవినీతిని, ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పరిస్థితులను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు నీలాపు అప్పలరామిరెడ్డి, దాసరి అప్పలస్వామి, పిడుగు తోటారావు, కర్రోతు రాజు, మైలపల్లి ఎల్లాజి, కోల రామసూరి, పిడుగు చందు, దారపురెడ్డి మధు, పాలపర్తి లక్ష్మణరావు, బైరెడ్డి రామకృష్ణ తదితరులుపాల్గొన్నారు.

నెల్లిమర్ల: మాట్లాడుతున్న మాజీ మంత్రి పతివాడ

ప్రజా సంక్షేమమే లక్ష్యం

ప్రజాశక్తి- బొబ్బిలి

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. 15వ సచివాలయం 29వ వార్డులో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతీ గడపకూ వెళ్లి మూడేళ్ళ పాలనలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అర్హులైన వారికి నేరుగా వాలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. మూడేళ్ళలో ఒక్కో కుటుంబం పొందిన లబ్ధిని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, వైస్ ఛైర్మన్లు గొలగాన రమాదేవి, చెలికాని మురళీకృష్ణ, మండల పార్టీ అధ్యకులు శంబంగి వేణుగోపాలనాయుడు, బుడా ప్రతినిధి ఇంటి గోపాలరావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, తహశీల్దార్ రాజారావు, పలువురు కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, పాల్గొన్నారు.

రైతులకు సేవ చేసే వారికి అండగా ఉంటా

ప్రజాశక్తి - శృంగవరపుకోట

రాజకీయ రంగు లేకుండా రైతులకు ఎవరు సేవ చేసినా వారి వెంటే ఉంటూ వారికి సహాయ సహకారాలు అందిస్తానని గీతం యూనివర్సిటీ చైర్మన్ ఎం. శ్రీభరత్ అన్నారు. తానా సభ్యుడు గొంప కృష్ణ ఆర్థిక సహాయంతో ఉత్తర అమెరికా తెలుగు సంఘం, తానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఆకుల డిపో వద్ద నిర్వహించిన తానా చైతన్య స్రవంతి కార్యక్రమంలో భరత్ పాల్గొని మాట్లాడారు. అమెరికాలో పనిచేసే ప్రతి పదిమంది సాఫ్ట్ వేర్ ఇంజనీర్లలో నలుగురు భారతదేశానికే చెందిన వారైతే అందులో ఇద్దరు మన తెలుగు రాష్ట్రాలకి చెందినవారు కావడం గర్వించదగ్గ విషయమన్నారు. ఇటువంటి వారందరూ కలిపి వాళ్ళ వాళ్ళ గ్రామాలకు, మండలాలకు ఏదో ఒక సాయం చేయాలని ఆలోచనతో సంఘంగా ఏర్పడి ప్రతి సంవత్సరం డిసెంబర్, జనవరి నెలలలో ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాలలో 45 రోజుల పాటు హెల్త్ క్యాంపులు, పిల్లలను చదివించడం, రైతులకు సహాయం చేయటం వంటి సేవా కార్యక్రమాలను నిర్వహించడం గొప్ప విషయమన్నారు. అందులో భాగంగానే గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత మెడికల్ అండ్ క్యాన్సర్ స్కినింగ్ శిబిరం, 3 వేల మంది రైతులకు పురుగుమందుల రక్షణ పరికరాలు, 300 మంది రైతులకు పురుగుల మందు స్ప్రేయింగ్ యంత్రాలు పంపిణీ చేస్తున్నారని చెప్పారు. అనంతరం తానా ప్రెసిడెంట్ లావు అంజయ్య చౌదరి మాట్లాడుతూ ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా 72 వేల మందితో 220 బినియన్ల డబ్బుతో వృద్ధి చెందిందన్నారు. ఈ సంఘం ద్వారా ఇప్పటివరకు 50 వేల మందికి కళ్ళు శస్త్ర చికిత్సలు, కళ్లద్దాలు అందించామన్నారు. రాష్ట్రంలో వెయ్యి మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, వికలాంగులకు ట్రై సైకిల్స్, విద్యార్థులకు లాప్‌టాప్స్, స్కూళ్లకు నడిచి వెళ్లే బాలికలకు సైకిల్స్ అందించామన్నారు. అనంతరం రైతులకు పురుగుల మందు రక్షణ పరికరాలు, పురుగులు మందు స్ప్రే మిషన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో తానా సెక్రెటరీ వేమూరి సతీష్, తానా సభ్యుడు గొంప కృష్ణ, తానా ఫౌండేషన్ చైర్మన్ యార్లగడ్డ వెంకటరావు, నియోజకవర్గంలోని ఐదు మండలాల తెలుగుదేశం నాయకులు, పాల్గొన్నారు.

రైతులకు ఉపకరణాలను అందిస్తున్న శ్రీభరత్, గొంప కృష్ణ

సమన్వయంతోనే అధికారం సాధ్యం

ప్రజాశక్తి - కొత్తవలస

ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అందరి సహకారంతోనే రాష్ట్రంలో మళ్లీ అధికారం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. కొత్తవలసలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎస్. కోట నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు తైనాల విజయ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నియోజకవర్గ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ పాలనపై గ్రామాల్లో శత శాతం సంతృప్తిని ప్రజలు తెలియజేయడం సంతోషకరమన్నారు. 134 రోజులుగా నియోజకవర్గంలో నిర్వహిస్తున్న గడప గడపకు కార్యక్రమం విజయవంతంగా సాగుతుందంటే అదంతా జగనన్న సంక్షేమ పాలనకు నిదర్శనమని అన్నారు. నియోజకవర్గ పరిశీలకులు తైనాల విజయకుమార్ మాట్లాడుతూ దేశంలో మరెక్కడా లేని విధంగా అవినీతి రహిత పరిపాలన చేస్తూ ఆదర్శవంతంగా ఈ ప్రభుత్వం నిలుస్తోందన్నారు. కార్యకర్తలను, నాయకుల్ని కలుపుకుని వారికి సముచిత స్థానం కల్పించిన నాయకుడు ఒక్క జగన్ మోహన్ రెడ్డి మాత్రమేనని కొనియాడారు. సచివాలయ స్థాయిలో కమిటీ నియామాకాలను చేపట్టి పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో డిసిసిబి చైర్మన్ చిన్నరామనాయుడు, కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నాయుడు బాబు, ఎంపిపిలు నీలం శెట్టి గోపమ్మ, గేదెల శ్రీనివాసరావు, దొగ్గ సత్యవంతుడు, జెడ్‌పిటిసిలు గొర్లె సరియు, ఎస్ అప్పారావు, మండల పార్టీ అధ్యక్షులు గొర్లె రవికుమార్, ముమ్ములూరి జగన్నాథం, ఒబ్బిన నాయుడు, కురాకుల సూర్యారావు, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, కర్రీ శ్రీను, అడపా ఈశ్వర రావు, గేదెల వెంకటరావు, స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, నియోజకవర్గ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి- డెంకాడ

గర్భిణులు, కిశోర్ బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని ఎపిఎం విజయలక్ష్మి అన్నారు. మండలంలోని గుణుపూరు పేట సచివాలయం, రఘుమండ, బంటుపల్లి, బొడ్డవలస, చింతల వలస, జొన్నాడ, డెంకాడ, కొండరాజుపేట, చొళ్ళంగిపేట గ్రామాల్లో మంగళవారం ఎనిమియాతో బాధపడుతున్న గర్భిణులు, బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తహీనత నివారణ కోసం ఆహారపు అలవాట్లను మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం, అంగన్వాడి టీచర్, గ్రామసంఘం సబ్ కమిటీ సభ్యులు, సిసి సురిబాబు తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం : రక్తహీనతపై అవగాహన అవసరమని ఎపిఎం ఎస్ సత్యవతి అన్నారు. మంగళవారం పురిటి పెంట బాలిక ఉన్నత పాఠశాల, సచివాలయ పరిధిలో గల కిశోర బాలికలకు, వారి తల్లిదండ్రులకు రక్తహీనత నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అలవాట్లు గురించి మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్, డి.ఆర్.డి.ఏ వైయస్సార్ క్రాంతి పథం శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ సహాయకురాలు ఇ.దుర్గా లక్ష్మీ, పి.లక్ష్మి, జి.ఏల్లేశ్వరి, సి.హెచ్.ఓ ఎం.సంతోషి, ఏ.ఎన్.ఎం ఎస్.సత్యవతి, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: సదస్సులో మాట్లాడుతున్న ఎపిఎం విజయలక్ష్మి

సామాజిక రుగ్మతలను పారద్రోలండి

గజపతినగరం : బాల్య వివాహాలు, రక్తహీనత వంటి సామాజిక రుగ్మతలు పారద్రోలాలని సామాజిక, పరివర్తన సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయాధికారి బి.రామకృష్ణ పిలుపు నిచ్చారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు లింగ వివక్ష, బాల్య వివాహాల నిర్మూలన, జంక్ ఫుడ్ వల్ల కలిగే ప్రమాదాలు, రక్తహీనత, పౌష్టికాహారం, మంచి అలవాట్లు, ఉన్నత లక్ష్యాలు, తదితర అంశాల గురించి అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజం అభివృద్ధి చెందాలంటే లింగ వివక్ష ఉండరాదని మగ, ఆడ పిల్లలను సమానంగా చూడాలని అన్నారు. ప్రతిరోజు మంచి పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనత రాకుండా కాపాడుకోవచ్చన్నారు. పానీపూరి, పిజ్జా, బర్గర్ వంటి వాటిలో టేస్టింగ్ సాల్ట్ పదార్థం వాడుతున్నారని దానివల్ల కాన్సర్లు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు జి.జగ్గారావు, శ్రావణి, లత, రామారావులతోపాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బి. రామకృష్ణ

పురుగుల మందు తాగి యువకుడు మృతి

జామి : మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన కొల్లి గణేష్ (22) పురుగులు మందు తాగి మృతి చెందాడు. జామి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. గణేష్ విశాఖలో ఒక కళాశాలలో చదువుతూ అక్కడే హాస్టల్లో ఉంటున్నాడు. అక్కడ భోజనం బాగోలేదని ఇటీవల స్వగ్రామం వచ్చేశాడు. దీనిపై తల్లిదండ్రులు మందలించడంతో మనస్థాపానికి గురై, ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్ఐ ఆర్‌విఎ నర్సింగరావు దర్యాప్తు చేస్తున్నారు.

భవానీ భక్తుడు మృతి

పూసపాటిరేగ : పూజకోసం అరటి ఆకులు తీస్తుండగా విద్యుత్ తీగలు అరటి చెట్టుకి తగలడంతో భవానీ మాలాధారణలో వున్న యువకుడు మంగళవారం మృతి చెందాడు. మండలంలోని సిహెచ్ అగ్రహారానికి చెందిన భవానీ మాధారణలో వున్న గుడివాడ అప్పలనాయుడు (23) పూజ నిమిత్తం గ్రామం సమీపంలో వున్న అరటితోటలోకి ఆకులు, చెట్లు కోయడానికి వెళ్లాడు. అరటి చెట్టును కోస్తుండగా పైన ఉన్న విద్యుత్ తీగలు చెట్టును తగిలాయి. దీంతో అతనుకు షాక్ కొట్టి కుప్పకూలిపోయాడు. చికిత్స నిమిత్త సుందరపేట ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు విడిచాడు. మృతుడుకు తల్లి సత్యవతి, తండ్రి అసిరినాయుడు అన్నయ్య జనార్దన్ వున్నారు. అందరితో కలిసి మెలిసి సరాదాగా ఉండే వ్యక్తి అకాల మరణంతో గ్రామంలో విషాదం నెలకొంది. ఎస్ఎస్ఐ ఎ.నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడు అప్పలనాయుడు

బకాయి వేతనాలు చెల్లించాలి

రేగిడి: గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు ప్రభుత్వం తక్షణమే 9 నెలల బకాయి వేతనాలను చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తి నాయుడు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద మంగళవారం గ్రీన్ అంబాసిడర్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనాలు చెల్లింపు బాధ్యతలను పంచాయతీలకు అప్ప జెప్పడాన్ని తక్షణమే విరమించుకోవాలన్నారు. 39 గ్రామపంచాయతీలో పని చేస్తున్న గ్రీన్ అంబాసిడర్ల బకాయి వేతనాలు, ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపిడిఒ గన్న వరపు కాశీ విశ్వనాధ రావుకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ల మండల అధ్యక్ష, కార్యదర్శులు త్రినాధ, బుచ్చి నాయుడు, సత్యనారాయణ, పెంటయ్య, మురళీ, పాపయ్య, సింహాచలం, రాంబాబు, సత్తిరాజు, సత్యం, దుర్గారావు, అప్పన్న, సూర్యారావు, ఈశ్వరరావు, శివరాం పాల్గొన్నారు.

ఎంపిడిఒకు వినతి పత్రాన్నిస్తున్న కార్మికులు

మెడలో చైనులు తస్కరించే వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-విజయనగరం

సెలూన్ కు వెళ్లి మర్ధన చేసుకొనే వ్యక్తుల మెడలో చైన్లు కాజేసిన షాపు యజమాని బెల్లపు శ్రీను ను అరెస్టు చేసినట్లు 1వ పట్టణ సిఐ బి.వెంకటరావు తెలిపారు. మంగళవారం వన్‌టౌన్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నగరంలోని ఆర్‌టిసి కాలనీలో సెలూన్ షాపు నడుపుకుంటూ గంట్యాడ మండలం జగ్గాపురానికి చెందిన బెల్లపు శ్రీను జీవనం సాగించేవాడు. సెలూన్ షాపునకు మర్ధనకు, కటింగుకు వచ్చే కస్టమర్లను మాటల్లో పెట్టి, వారి మెడలో ఉన్న బంగారు చైనులను తస్కరించేవాడు. చైనులు ఎక్కడ పోయింది ఖచ్చితంగా చెప్పలేని కస్టమర్లు ఫిర్యాదు చేసేందుకు వెనుకాడేవారు. విజయనగరానికి చెందిన ఇమంది బైరాగి, జయంతి సబ్బ శ్రీరామ్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసులు నమోదు చేసిన 1వ పట్టణ పోలీసులు దర్యాప్తు ప్రారంభించి, సెలూన్ షాపు యజమాని బెల్లపు శ్రీనును అదుపులోకి తీసుకొని విచారించారు. నేరం అంగీకరించడంతో అరెస్టు చేశారు. అతని నుంచి రెండు బంగారు చైనులను రికవరీ చేసినట్లుగా సిఐ వెంకటరావు తెలిపారు.

నేటి నుంచి విద్యుత్ పొదుపు వారోత్సవాలు

బొబ్బిలి : విద్యుత్ పొదుపు వారోత్సవాలు బుధవారం నుంచి వారం రోజులు పాటు జరుగుతాయని ఎపిఇపిడిసిఎల్ ఇఇ పూడి హరి తెలిపారు. విద్యుత్ పొదుపుపై ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సదస్సులు, వివిధ రకాల పోటీలు నిర్వహిస్తామన్నారు. బుధవారం విద్యుత్ పొదుపుపై ఉద్యోగులతో ప్రతిజ్ఞ, 14న విద్యుత్ పొదుపు ప్రాముఖ్యతపై చిత్రలేఖనం పోటీలు, 17న వ్యాసరచన పోటీలు, 20వరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. విద్యుత్తును పొదుపుగా వాడాలని కోరారు.